క్లుప్తంగా

జెడ్పీ చైర్మన్‌పై ఫిర్యాదు



మంత్రికి ఫిర్యాదు చేస్తున్న రామగిరి ఎంపీపీ

రామగిరి: జెడ్పీచైర్మన్ పుట్టమధు తమను అసభ్య పదజాలంతో దూషిస్తూ అనేక రకాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని రామగిరి ఎంపీపీ ఆరెల్లి దేవక్క ఆదివారం మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు ఫిర్యాదుచేశారు. ఒక మహిళ ఎంపీపీ అని కూడా చూడకుండా కమాన్‌పూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పూదరి సత్యనారాయణ రకరకాలు ఇబ్బందులకు గురిచేయడంతో పాటు సామాజిక మాధ్యమాల్లో ఇష్టం వచ్చినట్లు రాతలు రాస్తున్నాడని పేర్కొన్నారు. ఈ విషయంపై ఇప్పటికే బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్‌కు ఫిర్యాదుచేశామన్నారు.

స్వాగత తోరణానికి రంగులు వేయాలి



ఈవోకు వినతిపత్రం ఇస్తున్న పాలకవర్గం

కాల్వశ్రీరాంపూర్: ఓదెల మల్లికార్జున స్వామి ఆలయ స్వాగత తోరణం పెగడపల్లి గ్రామంలో ఆలయకమిటీ ఏర్పాటుచేసింది. ప్రస్తుతం ఈ స్వాగత తోరణం పాతబడి అంధవికారంగా కనిపిస్తోందని దీంతో భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయన్నారు. వెంటనే స్వాగత తోరణానికి రంగులు వేసి అందంగా తీర్చి దిద్దాలని పెగడపల్లి సర్పంచు ఆరెల్లి సుజాత, పాలకవర్గం, గ్రామస్తులు ఆలయ ఈవోకు ఆదివారం వినతిపత్రం అందించారు. ప్రభుత్వ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించి అనుమతి తీసుకుంటామని ఈవో హామీ ఇచ్చారు.

ఆలయానికి విరాళం



విరాళం అందిస్తున్న లయన్స్‌క్లబ్ నిర్వాహకులు

రామగిరి: మండలంలోని రామయ్యపల్లెలో సాయిబాబా ఆలయ వార్షికోత్సవం సందర్భంగా భక్తులకు అన్నదానం చేయడానికి సెంటనరీకాలనీలోని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం రూ.15వేలను సర్పంచ్ దేవునూరి రజితకు విరాళం అందించారు. కార్యక్రమంలో కన్నూరి శ్రీనివాస్, గంట వెంకటరమణరెడ్డి, ముల్మూరి శ్రీనివాస్, ప్రతాపరెడ్డి, సురేశ్, రెండ్ల అశోక్, బూర్గు రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సింగరేణి డైరెక్టర్ శ్రీనివాస్‌కు సన్మానం



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న నాయకులు

రామగిరి: సింగరేణి సంస్థ అడ్రియాల ప్రాజెక్టు జీఎంగా విధులు నిర్వహించి ఇటీవల పదోన్నతిపై ఆపరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన ఎన్వీ. శ్రీనివాస్‌ను టీబీజీకేఎస్ నాయకులు ఆదివారం శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో గౌతం శంకరయ్య, జక్కుల దామోదర్‌రావు పీ.వీ.రావు. డైరెక్టర్ వెంట ఏపీఏ జీఎం కొప్పుల వెంకటేశ్వర్లు, ఏజీఎం సీతారాం ప్రాజెక్టు ఆఫీసర్ నాగేశ్వర్‌రావు, సుధాకర్ ఉన్నారు.

ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా



నీటిని సరఫరాచేస్తున్న సర్పంచ్, సిబ్బంది

ఎలిగేడు: మండలంలోని ధూళికట్టలో డబుల్ రోడ్డు నిర్మాణ పనుల్లో మిషన్‌భగీరథ పైపులైన్ నల్లా కనెక్షన్లు పాడవడంతో మరమ్మతులు చేస్తున్నారు. ఈ సందర్భంగా ప్రజలకు నీటి ఇబ్బందులు తలెత్తకుండా సర్పంచ్ కావేరి ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది పెద్దమ్మ ఆలయం నుంచి పలు వీధులకు ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ అభివృద్ధి పనులను పర్యవేక్షించారు.

ఘనంగా సంకష్టహర చతుర్థి

యైటింక్లయిన్‌కాలనీ: యైటింక్లయిన్‌కాలనీలోని శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో సంకష్ట హర చతుర్థి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని గణపతి స్వామి మూలవిరాట్‌కు అర్చకులు పాలు పంచామృతలతో అభిషేకాలు చేసి అష్టోతర శతనామవాళి, అర్చన, హారతి, తీర్థప్రసాదాలు అందించారు. ఆలయకమిటీ అధ్యక్షుడు కాల్వ చంద్రశేఖర్‌రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, ఆలయకమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

లక్ష్యం దిశగా 'ఆయిల్ పామ్' సాగు

- జిల్లాలో 1178 ఎకరాలకు చేరిన ఆయిల్‌పామ్ తోటలు
- ప్రభుత్వ ప్రోత్సాహంతో రైతుల ముందడుగు
- భారీగా సాగు చేయించేందుకు ఉద్యాన శాఖ ప్రయత్నం
- అందుబాటులో నర్సరీ, ఫ్యాక్టరీ నిర్మాణం



పెద్దాపూర్‌లో ఆయిల్‌పామ్ మొక్కలు నాటుతున్న రైతులు

జూలపల్లి: పామాయిల్ నూనె తప్ప చెట్టు ఎలా ఉంటుందో తెలియని రైతులకు ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ విదేశాల నుంచి విత్తనాలు తెప్పించి పెంచి, సబ్సిడీ ఇచ్చి సాగు చేయించేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఆచరణలోకి వస్తున్నాయి. దీంతో రైతులకు ఆదాయాన్ని పెంచడంతో పాటు, విదేశీ మారకద్రవ్యాన్ని ఆదా చేసేందుకు చేస్తున్న కృషి త్వరలోనే సాకారం కానుంది. జిల్లా వ్యాప్తంగా మండలకేంద్రాలు, గ్రామాల్లో ఇప్పటికే 1178 ఎకరాల్లో ఆయిల్ పామ్ తోటలు పెంచేందుకు మొక్కలు నాటారు. జిల్లాలో ఇంకా ఆయిల్ పామ్ తోటలను పెంచేందుకు రైతులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తూ ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటోంది. ఆయిల్‌పామ్ సాగుకు ఉమ్మడి జిల్లా నేలలు అనువుగా ఉండడం, సాగు నీరు అందుబాటులో ఉండడం, నికర ఆదాయం వస్తుందని చెబుతున్న ఉద్యాన శాఖ అధికారుల మాటలతో రైతులు ఆయిల్ పామ్ తోటలను పెంచేందుకు ఆసక్తి చూపుతున్నారు.

జిల్లాలోని 14 మండలాల్లో 2,600 ఎకరాల్లో ఆయిల్‌పామ్ మొక్కలు సాగు చేయించాలని ఉద్యాన శాఖ లక్ష్యం పెట్టుకొని ముందుకు సాగుతుండగా, 375 మంది రైతులతో ఇప్పటి వరకు 1178 ఎకరాల్లో సాగు చేయించారు. త్వరలోనే లక్ష్యం సాధించే దిశగా ఉద్యాన శాఖ చర్యలు చేపట్టింది.

అందుబాటులో నర్సరీ,ఫ్యాక్టరీ నిర్మాణం..

పెద్ద ఎత్తున ఆయిల్ పామ్ సాగుకు అవసరమై నర్సరీ సుల్తానాబాద్ మండలం చిన్న కల్వల వద్ద ఏర్పాటు చేశారు. కాత మొదలయ్యాక, కొనిగానుగ ఆడించేందుకు కాల్వశ్రీరాంపూర్ మండలం పెద్దరాతు పల్లి వద్ద ఫ్యాక్టరీ నిర్మించేందుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేయడంతో పనులు మొదలయ్యాయి.

మొక్కలు, అంతర పంటలకు సబ్సిడీ...

మొక్కలను పెంచి రైతులకు సరఫరా చేసేందుకు రూ.190 మొక్కకు ఖర్చవుతుండగా ప్రభుత్వం సబ్సిడీతో రూ.19కే సరఫరా చేయడంతో పాటు ఎకరాకు మొక్కల సంరక్షణకు, అంతర పంటల సాగుకు ప్రతీ సంవత్సరం రూ.4200 అందిస్తోంది. ఇతర పంటలకు లేని డ్రిప్ సబ్సిడీని ఆయిల్ పామ్ తోటలకు మాత్రమే ప్రభుత్వం ఇస్తోంది. ఇందులో ఓసీలకు 80 శాతం, బీసీలకు 90 శాతం,ఎస్సీలకు 100శాతం డ్రిప్ సబ్సిడీని అందిస్తోంది.

పంట చేతికందే సమయం, రాబడి, దిగుబడి...

ఆయిల్‌పామ్ మొక్క నాటిన నాలుగేళ్ల తర్వాత కాతకు వస్తుంది. ఐదో సంవత్సరం నుంచి దిగుబడి మొదలై ఎకరాకు 10 నుంచి 12 టన్నుల దిగుబడి వస్తుందని ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు. టన్నుకు రూ.10 వేలు ధర ఉన్నా, సంవత్సరానికి లక్ష ఆదాయం ఉంటుందని, దాదాపు 30 ఏళ్లు దిగుబడి వస్తుందని అధికారులు చెబుతున్నారు. దీంతో రైతులు పామ్ ఆయిల్ తోటల సాగు వైపు మరలుతున్నారు.

ఆయిల్ పామ్ సాగుతో నికర ఆదాయం..



రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వచ్చే పంటలను సాగుచేయాలి. ఇందుకు నికర ఆదాయం అందించే ఆయిల్ పామ్ తోటలను పెంచి, ఆదాయంతో పాటు విదేశీ మారకద్రవ్యం, ఆదా కు, ఉపాధికి తోడ్పాటునందించిన వారవుతారు. ప్రభుత్వ ప్రోత్సాహం ప్రతీ రైతుకు అందించేందుకు కృషిచేస్తాం. – జ్యోతి, ఉద్యానశాఖ అధికారి

వ్యవసాయ శాఖ సహకారం



ఆయిల్ పామ్ తోటలను పెంచే రైతులకు వ్యవసాయ శాఖ తరఫున అన్ని రకాలుగా సహకారం అందిస్తాం తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వచ్చే పంటలు సాగుచేయాలి. సస్య రక్షణ, భూసారం పెంపు, అంతర పంటల సాగులో మెళకువలు అందిస్తాం. – ప్రత్యూష, ఏవో

ఆయిల్ పామ్ మొక్కలు పెంచాలనుకుంటున్న



ఉద్యానశాఖ అధికారుల ప్రోత్సాహంతో రైతులకు నికర ఆదాయం వస్తే ముందుకు వస్తారు. మేము కూడా సాగుచేయాలని నిర్ణయించుకున్నాం. ముందువేసిన పంట వస్తే ఆదాయం చూసి మరింత మంది రైతులు తోటలు పెంచుతారు. – కుంట రాజేశ్వర్‌రెడ్డి, రైతు కుమ్మరికుంట

బోనమో పోచమ్మ తల్లి..



జూలపల్లిలో పోచమ్మ బోనాలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు

జ్యోతినగర్/కమాన్‌పూర్: ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనీలో రెడ్డిసంఘం ఆధ్వర్యంలో, ఆటోనగర్‌లోని ప్రజలు, కమాన్‌పూర్ మండలంలో ని జూలపల్లిలో రేణుకా ఎల్లమ్మ తల్లి ఉత్సవాల్లో భాగంగా గౌడకులస్తులు ఆదివారం పోచమ్మ బో నాలు ఘనంగా నిర్వహించారు. ఇంటికో బోనంతో మహిళలు డప్పుచప్పుళ్ల శివసత్తుల పూనకా లతో ఆలయానికి వెళ్లి అమ్మవారికి బోనం నైవేద్య ంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఎన్వీ రమణారెడ్డి, ఎన్టీపీసీ పట్టణ రెడ్డిసంఘం అధ్యక్షుడు డాక్టర్ విజేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కూర మహేశ్వర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు మందల బక్కారెడ్డి, కాంట్రాక్టర్ ఏబీసీ రెడ్డి, కార్యవర్గ సభ్యులు, కోర్‌కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఆటోనగర్‌లో బోనమెత్తిన ప్రజలు

ఆలయంలో హోమం

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ లక్ష్మీపురం గ్రామంలో శ్రీపుట్ట నాగమల్లేశ్వర స్వామి ఆలయంలో సుబ్రహ్మణ్యస్వామి, జోడు నాగులు, దత్తాత్రేయ విగ్రహాల ప్రతిష్టాపనలో భాగంగా ఆదివారం అర్చకులు శేషం కృష్ణమూర్తి బృందం హోమం నిర్వహించారు. అనంతరం ఆలయకమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



హోమంలో కూర్చున్న దంపతులు

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం



పెద్దపల్లిరూరల్: మండలంలోని అందుగులపల్లి రాజీవ్‌రహదారి నుంచి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం ఉన్న దేవునిపల్లి వరకు రోడ్డును బీటిరోడ్డుగా మార్చేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం అభినందనీయమని అందుగులపల్లి, దేవునిపల్లి సర్పంచులు కారెశారద, రాయిశెట్టి కిషన్, ఎంపీటీసీ పందిళ్ల లక్ష్మణ్ అన్నారు. అందుగులపల్లిలో ఆదివారం సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకంచేసి ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు తలారిసాగర్, దామసదయ్య, నర్సింగం, అంజిబాబు, రాజేశ్ న్నారు.

శరీర, అవయవదానాలపై అవగాహన

పెద్దపల్లిరూరల్: సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పెద్దపల్లిలో శరీర, అవయవదానాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన ఆంజనేయులు తన తల్లి రాజమ్మ మృతదేహాన్ని ఆదివారం సదాశయఫౌండేషన్‌కు అందించారని కుటుంబీకులను అభినందించారు. అనంతరం వారి బంధువుల నుంచి శరీరదానం, నేత్రదానం చేసేలా అంగీకారం కుదిరిందన్నారు. మరణానంతరం శరీరాన్ని, అవయవాలను దానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు శ్రవన్‌కుమార్, లింగమూర్తి, రాజమౌళి, రాజలింగయ్య, కనకయ్య, రాజు, చందు, మల్లయ్య సత్యనారాయణ తదితరులున్నారు.



అవగాహన కల్పిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

కనగర్తిలో పారిశుధ్య సిబ్బంది భిక్షాటన

- వేతనాలు చెల్లించనందుకు గ్రామంలోని ప్రధాన వీధుల్లో భిక్షాటన
- నాలుగు నెలలుగా అందని జీతాలు

ఓదెల: మండలంలోని కనగర్తిలో జీపీ కార్యాలయ సిబ్బంది తమకు వేతనాలు చెల్లించడం లేదని ఆదివారం భిక్షాటన చేశారు. జీపీలో పనిచేస్తున్న 10 మంది డప్పుచప్పుళ్లతో ఉదయం మధ్యాహ్నం వరకు భిక్షాటన చేశారు. నవంబర్ నుంచి ఇప్పటి వరకు నాలుగు నెలలుగా వేతనాలు రావడం లేదని దారి వెంట వెళ్లే బాటసారులతో, షాపుల యాజమానులతో తమగోడును వెల్లబోస్తూ భిక్షాటన చేశారు. మండలంలోని మిగతా జీపీల్లోని కార్మికులకు 15వ ఆర్థికసంఘం నిధుల ద్వారా చెల్లిస్తున్నారని, మాకు అదే పద్ధతి పాటించాలని కోరారు. భిక్షాటనలో కార్మికులు పైడిపల్లి నాగయ్య, శనిగరపు బాబు, కందునూరి శ్రీనివాస్, చిటికెసి ప్రభాకర్, చెరకుతోట శ్రీనివాస్, పైడిపల్లి స్వప్న, తాళ్లపల్లి శంకర్, కొండ్ర రాజయ్య, జాకీర్, తాళ్లపల్లి రమేశ్ పాల్గొన్నారు.



భిక్షాటన చేస్తున్న పారిశుధ్య సిబ్బంది

రామయ్య చెంతకు కోటి తలంబ్రాలు

గోదావరిఖనిటౌన్: భద్రాద్రి రామయ్య కల్యాణానికి స్థానిక భక్తులు గోటితో ఒలిచిన కోటి తలంబ్రాలను పంపించారు. స్థానిక కోదండ రామాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం తలంబ్రాలను అప్పగించారు. జయశంకర్‌భూపాలపల్లి జిల్లా చెల్పూర్‌కు చెందిన రామ భక్తుడు రామదాసు తిరుపతి, తిరుపతమ్మ దంపతులు ఐదేళ్లుగా వరిపంట పండించి.. వచ్చిన ధాన్యాన్ని తలంబ్రాల కోసం సిద్ధం చేస్తున్నారు. ఈ ఏడాది గోదావరిఖనికి చెందిన భక్తులకు అప్పగించారు. గోలివాడ చంద్రకళ, సునీత, సరిత, లక్ష్మీ, సౌజన్య, భాగ్యలక్ష్మి, కేదారేశ్వరి, రాధిక, స్వరూపారాణి పాల్గొన్నారు.



భక్తులు సిద్ధంచేసిన కోటి తలంబ్రాలు

ఆలయ అర్చకుడికి వేతనం చెల్లింపు

రామగుండం: అంతర్గాం మండలపరిధిలోని పెద్దంపేట శ్రీదాసాంజనేయస్వామి ఆలయ అర్చకుడికి అందించే నెలవారి వేతనం రూ.2500 నగదును ఆదివారం గ్రామానికి చెందిన వెలమరెడ్డి మాధవరెడ్డి హైకోర్టు న్యాయవాది అందించారు. కాగా గతంలో సదరు న్యాయవాది ఆలయానికి మైక్‌సెట్‌ను అందిస్తూ ఆలయ అభివృద్ధికి సహకరిస్తానని హామీ ఇచ్చారన్నారు.

అర్హులకు డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలి

రామగుండం: అర్హులైన వారందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలని, సొంత స్థలం ఉన్నవారికి ప్రభుత్వం తక్షణమే రూ.3 లక్షలు అందించాలని ప్రభుత్వ హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఎం జిల్లా కోశాధికారి ఎం.రామాచారి అన్నారు. ఈ మేరకు ఆదివారం పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. వేలాదిగా వచ్చిన దరఖాస్తులు, పదుల సంఖ్యలో ఉన్న డబుల్‌ఇళ్లు, అందులో లబ్ధిదారుల ఎంపికలో ప్రజాప్రతినిధుల చేతివాటం తదితర అంశాలతో అసలైన లబ్ధిదారులకు లబ్ధిచేకూరే అవకాశాలు కనిపించడం లేదన్నారు. అనంతరం సీపీఎం పట్టణ కార్యదర్శిగా గుండు కనకయ్యను ఎన్నుకున్నారు. సమావేశంలో అడారి నర్సింగరావు, మల్లేశ్, శ్రీనివాస్‌గౌడ్, వై.సత్యనారాయణ, గట్టు భీమయ్య తదితరులున్నారు.



మాట్లాడుతున్న రామాచారి

క్రిస్టియన్ మైనార్టీలకు అండగా బీఆర్ఎస్

రామగుండం: క్రిస్టియన్ మైనార్టీలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని, వారి సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషిచేస్తుందని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. ఈ మేరకు ఆదివారం అంతర్గాం మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి చర్చిలో పరిశుద్ధాత్మ ఉజ్జీవ వేడుకలకు హాజరయ్యారు. అనంతరం రామగుండం పట్టణంలో ఐబీటీ చుక్కా రామయ్య పాఠశాల వార్షికోత్సవానికి హాజరై మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. అనంతరం ఉత్తమ విద్యార్థులను జ్ఞాపికతో సన్మానించారు. కార్యక్రమంలో పాస్టర్ పద్మారావు, బీఆర్ఎస్ ప్రతినిధులు కోల సంతోష్‌గౌడ్, ఆవునూరి రాజేశ్, ఆలకుంట అంజయ్య, కార్పొరేటర్లు కన్నూరి సతీశ్‌కుమార్, ముదాం శ్రీనివాస్, బీఆర్ఎస్ ప్రతినిధి సలీంబేగ్, పాఠశాల నిర్వాహకుడు దుర్గాప్రసాద్ తదితరులున్నారు.



జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యే చందర్

పార్టీలకు అతీతంగా అభివృద్ధి

సుల్తానాబాద్: పట్టణాలు, గ్రామాల అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తున్నామని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. ఆదివారం సుల్తానాబాద్ పట్టణంలోని 8వవార్డులో టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.40 లక్షలతో సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్సీ కవితపై అనుచిత వ్యాఖ్యలు తగదని ఎంపీ బండి సంజయ్ మాటలు వెనక్కి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత మండల అధ్యక్షుడు పురం ప్రేమ్‌చందర్‌రావు, కేడీసీసీబీ డైరెక్టర్ శ్రీగిరి శ్రీనివాస్, పట్టణాధ్యక్షుడు పారుపెల్లి గుణపతి వైస్ చైర్మన్ బిరుదు సమత కౌన్సిలర్లు సునీత, గుర్రాల శ్రీనివాస్, కూకట్ల గోపి,రేవెల్లి తిరుపతి,పసెడ్ల మమత నాయకులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

బండి సంజయ్‌పై బీఆర్ఎస్ నేతల ఫిర్యాదు

గోదావరిఖని: ఎమ్మెల్సీ టీబీజీకేఎస్ గౌరవఅధ్యక్షురాలు కవితపై బండిసంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసనగా ఆదివారం గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ ప్రసాదరావుకు బీఆర్ఎస్ మహిళా నేతలు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి మూల విజయారెడ్డి, కార్పొరేటర్లు జెట్టి జ్యోతి, రాకం లత, కవిత సరోజిని, నూనె లతమోహన్, గోలివాడ చంద్రకళ, ముద్దసాని సంధ్యారెడ్డి, అడ్డాల గట్టయ్య, అడ్డాల రామస్వామి, జెట్టి రమేశ్, రాకం దామోదర్, తోడేటి శంకర్‌గౌడ్, మురళీధర్‌రావు, నారాయణదాసు మారుతి, పర్లపల్లి రవి పాల్గొన్నారు.

జేబు సంస్థలతో వేధింపులా?

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం జేబు సంస్థలతో వేధింపులకు దిగుతున్నారని పోలీస్‌హౌజింగ్ బోర్డు చైర్మన్ కోలేటి దామోదర్ విమర్శించారు. బీఆర్ఎస్ ఎదుగుదలను ఓర్వలేకే బీజేపీ కుటిల పన్నాగాలు పన్నుతోందన్నారు. దేశరాజకీయాల్లో కీలకపాత్ర పోషిస్తున్న కేసీఆర్‌ను ఎదుర్కొనలేక ఆయన కుమార్తె కవితను కేంద్రం టార్గెట్ చేసిందన్నారు. వేధింపులను విడనాడకపోతే అందుకు తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.



మహిళలకు కరువైన రక్షణ..

మంథని: మహిళలపై దాడులు పెరిగాయని, రక్షణ లేకుండా పోయిందని ఐద్వా జిల్లా కార్యదర్శి మహేశ్వరి అన్నారు. ఆదివారం మంథనిలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని, మహిళల రక్షణకు చట్టాలు తీసుకువచ్చి పకడ్బందీగా అమలు చేయాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేశ్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ల సందీప్, రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి గొర్రెంకల సురేశ్ తదితరులు ఉన్నారు.

శ్రీఆదివరాహస్వామి సేవలో మంచిర్యాల ఎమ్మెల్యే



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

కమాన్‌పూర్(మంథని): మండలకేంద్రంలోని శ్రీ ఆదివరాహస్వామిని మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్ రావు కుటుంబసభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు కల్వకుంట్ల వరప్రసాదాచార్యులు ఎమ్మెల్యే కుటుంబసభ్యులను సన్మానించి స్వామివారి చిత్రపటంతోపాటు తీర్థ ప్రసాదాలు అందించారు.

మల్టీపర్పస్ విధానం రద్దుపర్చాలి

పెద్దపల్లిరూరల్: పంచాయతీ కార్మికులకు మల్టీపర్పస్ విధానాన్ని రద్దుపర్చాలని, పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలో ఆదివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. కారోబార్, బిల్‌కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ ఇవ్వాలని, జీఓ 51ను సవరించాలని, ఉద్యోగభద్రత కల్పించాలని, ప్రభుత్వ పథకాల అమలులో ప్రాధాన్యతనివ్వాలని డిమాండ్ చేస్తూ ఈనెల 16న కలెక్టరేట్ ఎదుట వంటావార్పు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్మికులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు ఖాజా, తిరుపతి, అశోక్, రాజబాబు, స్వామి, శ్రీనివాస్, మహేశ్, ఆనంద్, సాంబయ్య, రాజయ్య తదితరులున్నారు.

శ్రీనివాస్‌కు జాతీయ అవార్డు



అవార్డు అందిస్తున్న రాధాకృష్ణ


సుల్తానాబాద్: మున్సిపాలిటీ పరిధి పూసాలకు చెందిన కనుకుంట్ల శ్రీనివాస్‌కు అంబేడ్కర్ నేషనల్ అవార్డును జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ అందించారు. ఆదివారం రాత్రి తిరుపతిలో నిర్వహించిన సాహిత్య అకాడమీ సౌత్ ఇండియా కాన్ఫరెన్స్‌లో అవార్డును ప్రదానంచేశారు. ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మామిడిపల్లి బాపయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం, జోగేందర్ తదితరులు పాల్గొన్నారు.

రెండు ట్రాక్టర్ల గడ్డి వాము దగ్ధం



ధర్మారం: మండలంలోని నంది మేడారం గ్రామంలో బొడ్డు రాజయ్యకు చెందిన గడ్డివాముకు ఆదివారం ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించడంతో పెద్దపల్లి ఫైర్ స్టేషన్ సిబ్బంది సకాలంలో వచ్చి మంటలు ఆర్పారు. దీంతో భారీ ప్రమాదం తప్పింది. రాజయ్య ఇంటి సమీపంలోనే పశువుల కోసం రెండు ట్రాక్టర్ల గడ్డిని నిల్వ చేశాడు. దీంతో ప్రమాదవశాత్తు గడ్డివాముకు నిప్పంటుకుని మంటలు లేవడంతో గ్రామస్తులు మంటలు ఆర్పేందుకు యత్నించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. దీంతో స్థానికులు పెద్దపల్లి ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. వెంటనే ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు ఆర్పారు, గడ్డివాము సమీపంలోని ఇళ్లు ఉండడంతో మంటలు ఇళ్ల వరకు వ్యాపిస్తే పెద్ద ప్రమాదం జరిగేదని గ్రామస్తులు తెలిపారు.





క్లుప్తంగా

సీఎం సహాయనిధి చెక్కులు అందజేత



చెక్కులు అందజేస్తున్న నాయకులు

రామగిరి: ముత్తారం మండలం ఓడేడ్‌కు చెందిన పలువురికి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శనివారం కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన నూనె శీనుకు రూ. 14,500లు, సుధాడి రత్నాకర్ రావుకు రూ.60 వేల చెక్కులను ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు బాధితులకు అందించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు దాసరి చంద్రమౌళి, పవన్ కళ్యాణ్, రత్న కొమురయ్య, దేవునూరి సదయ్య, రత్న శంకర్, తీగల సత్యనారాయణ రావు, తదితరులు పాల్గొన్నారు.

కోళ్ల యూనిట్లు పంపిణీ



కోళ్లు అందజేస్తున్న పశు వైద్యాధికారి

ఎలిగేడు: మండల కేంద్రంలోని పశు వైద్యశాలలో శనివారం 20 యూనిట్ల పౌల్ట్రీ కోళ్లను లబ్ధిదారులకు పశువైద్యాధికారి రూప్సీ, సర్పంచ్ భూర్ల సింధూజ పంపిణీ చేశారు. ఒక్కో యూనిట్లో 25 కోళ్లు ఉంటాయని , యూనిట్‌కు రూ.1850 కాగా 1250 సబ్సిడీ పోను లబ్ధిదారుని వాటా రూ.600 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కోరుకంటి వెంకటేశ్వర్‌రావు, గోపాలమిత్ర పెద్ది సమ్మయ్య, వెటర్నరీ వైద్యసిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభించిన ఎంపీపీ

కమాన్‌పూర్: మండలంలోని గుండారం సమ్మక్క వాడలో ఉపాధిహామీ నిధులతో చేపడుతున్న సీసీరోడ్డు పనులను శనివారం ఎంపీపీ రాసకొండ లక్ష్మి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆకుల ఓదెలు, ఉప సర్పంచ్ రాసకొండ చందు, వార్డు సభ్యురాలు సమ్మక్క, నాయకులు కిషన్‌రెడ్డి, రాసకొండ రవి, పిడుగు అంజి, గాదె సదయ్య, ముప్పిడి బాలకృష్ణ తదితరులున్నారు.

ఉచిత దంత వైద్య శిబిరానికి స్పందన

పాలకుర్తి:మండలంలోని కన్నాలలో బీజేపీ ఆధ్వర్యంలో శ్రీ కోదండ రామాలయంలో నిర్వహించిన ఉచిత దంతవైద్య శిబిరానికి స్థానికుల నుంచి స్పందన లభించింది. గోదావరిఖనికి చెందిన మోహన్ డెంటల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో వైద్యులు కృష్ణమోహన్, సుధ పాల్గొని గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు తొగరి తిరుపతి, బుర్ర సదిగౌడ్, కంకటి శ్రీనివాస్, గండికోట బొబ్బిలి రాజ్, కొమిరె లక్ష్మణ్, మల్క సురేందర్, రాజశేఖర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

శ్రీదత్తాత్రేయ నూతన విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం


రామగిరి:మండలంలోని బుధవారంపేటలోని శ్రీసాయిబాబా ఆలయంలో ఈనెల 13 న ఆలయ 17వ వార్షికోత్సవంతో పాటు శ్రీ దత్తాత్రేయ నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం, రుద్రాభిషేకం నిర్వహించనున్నట్లు సర్పంచ్ దేవునూరి రజిత తెలిపారు. ఉదయం 10:30 గంటలకు వేద బ్రాహ్మణులతో శ్రీ గురుదేవ దత్త విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

వైకుంఠ రథానికి 'సెల్ఫ్' ప్రాబ్లమ్



వాహనాన్ని నెడుతున్న మృతుడి బంధువులు

కోల్‌సిటీ: శ్మశానవాటికకు మృతదేహాన్ని తరలిస్తున్న వైకుంఠరథం మార్గమధ్యలోనే ఆగిపోయిన సంఘటన శనివారం రాత్రి రామగుండంలో జరిగింది. రమేశ్‌నగర్‌లో చనిపోయిన ఓ వ్యక్తి మృత దేహాన్ని వైకుంఠ రథంలో శ్మశానవాటికకు తరలిస్తుండగా, గోదావరిఖని గాంధీ చౌరస్తా వరకు రాగానే వాహనం అకస్మాత్తుగా ఆగిపోయింది. చివరికి వాహనంలో ఉన్న మృతుడి బంధువులను కిందికి దించి, వారితో వైకుంఠరథాన్ని నెట్టించడంతో వాహనం స్టార్ట్ అయ్యింది. సెల్ఫ్ ప్రాబ్లంతోనే వాహనం ఆగిపోయిందని తెలిసింది.



సుద్దముక్కపై కాకతీయుల స్వాగత తోరణం



సుద్దముక్కపై త్రిశూలం లింగం



భళారే.. సూక్ష్మ కళ!

- సుద్దముక్కలపై వివిధ కళాకృతులు
- అద్భుతాలు సృష్టిస్తున్న ఆర్ట్ టీచర్ ఆడెపు రజనీకాంత్
- పలు అవార్డులు, రివార్డులు, కళారత్న బిరుదు సొంతం
- గిరిజన విద్యార్థులకు కళ నేర్పుతున్న వైనం



సండే స్పెషల్

ఓదెల: కాదేదీ కళకు అనర్హం అన్నట్లు నిరూపిస్తున్నాడు ఓదెల మండలం మడక గ్రామానికి చెందిన ఆడెపు రజనీకాంత్. కాటారం గిరిజన బాలుర కళాశాలలో ఆర్ట్ టీచర్‌గా పని చేస్తున్న రజనీకాంత్ సుద్దముక్కలపై వివిధ కళాకృతులను చెక్కుతూ ప్రతిభ చాటుతున్నాడు. ఇప్పటివరకు దాదాపు 500 చాక్‌పీసులపై వివిధ రకాల ఆకృతులను చెక్కి ప్రపంచ రికార్డులు కైవసం చేసుకున్నాడు. పాఠశాలల్లో బ్లాక్ బోర్డుపై ఉపయోగించే చాక్‌పీస్‌లు(సుద్ద ముక్క) అగ్గిపుల్లలు, కోడిగుడ్లు, దొల్లలు, సబ్బులు, పెన్సిల్ మొనలు, కొవ్వొత్తులు, క్యారెట్, బంగాళ దుంప, చాక్లెట్లు చైనామట్టితో వివిధ ఆకృతులు, శిల్పాలు, కళాకండాలను తయారు చేస్తున్నాడు



సబ్బుపై భారతదేశ చిత్రం

బియ్యపు గింజలపై జాతీయ గీతం

చార్‌మీనార్‌ను సుమారు 1.5 సెంటీమీటర్ల ఎత్తుతో, శాంతికి ప్రతిబింబంగా పిలుచుకునే గౌతమ బుద్ధుడి ప్రతిమ, పెన్సిల్ గ్రాఫైట్‌పై 1 సెంటిమీటర్ ఎత్తుతో, తాజ్‌మహల్, సప్తస్వరాల వీణ, ఆంజనేయస్వామి, ఏసుక్రీస్తు శిలారూపాన్ని 2 సెంటీమీటర్లతో ఎత్తుతో చెక్కి అబ్బురపరిచాడు. తెలంగాణ తల్లి విగ్రహ రూపంను 4.5 సెంటీమీటర్ ఎత్తుతో మూడుగంటలపాటు శ్రమించి తయారుచేశాడు. రెండు బియ్యపుగింజలపై జాతీయగీతం జనగణమన 278 ఆంగ్లఅక్షరాలను ఎలాంటి మైక్రోస్కోపు అవసరం లేకుండా రాసినందుకుగాను తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఫోక్‌ఆర్ట్స్ అకాడమీ గ్రామీణ కళాజ్యోతి అవార్డును మంత్రి గంగుల కమలాకర్ చేతుల మీదుగా అందుకున్నారు.

స్వాతంత్య్ర సమరయోధుల చిత్రాలు సైతం..

అగ్గిపుల్ల, పెన్సిల్ మొనలపై క్రికెట్ వరల్డ్‌కప్ నమూనాను తయారుచేశాడు. జవహర్‌లాల్‌నెహ్రూ, అబ్దుల్‌కలాం, రవీంద్రనాథ్ ఠాగుర్, సర్వేపల్లి రాధాకృష్ణ లాంటి స్వాతంత్య్ర సమరయోధుల ముఖాలను చిత్రీకరించాడు. పెన్సిల్ గ్రాఫైట్‌పై 2 మిల్లీ మీటర్ల ఎత్తుతో ఏనుగు చెస్ కాయిన్, బతుకమ్మను ఎత్తుకున్న ఆడపడుచు, హృదయాకారంను చెక్కి అబ్బురపరిచాడు. కాకతీయుల కళాతోరణం, భద్రాచలం శ్రీరాముల వారి ఆలయం, రాఖీ, హ్యాపీ న్యూఇయర్,.పెన్సిల్ గ్రాఫైట్‌పై శివలింగము, క్యారెట్‌తో ఆలుగడ్డ, సుద్దముక్కతో శివలింగం, చాక్లెట్‌తో పాము, ఈఫిల్ టవర్, వినాయక విగ్రహాలు, ఐపీఎల్ క్రికెట్ కప్, సబ్బుపై భారతదేశ చిత్రపటం, త్రివర్ణపతాకం, తెలంగాణ అమర వీరుల స్థూపంను చెక్కి అద్భుతాలు సృష్టిస్తున్నాడు. 2013లో ఒకే బియ్యపు గింజపై 72 ఆంగ్ల అక్షరాలను 50 నిమిషాల్లో రాసినందుకు బుక్ ఆఫ్ స్టేట్ రికార్డు వారిచే సృజనపుత్ర అవార్డు అందుకున్నాడు. 2016లో నటరాజ రామకృష్ణ వర్ధంతి సందర్భంగా లింబోధర కల్చరల్ అకాడమీ సిరిసిల్ల వారి ఆధ్వర్యంలో నిర్వహించిన సూక్ష్మ కళ పోటీల్లో ప్రతిభ కనబరిచి ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఉత్తమ అవార్డును కైవసం చేసుకున్నారు.

పట్టుదలతో సూక్ష్మ కళాకారుడియ్యాను



మాస్టారు లేకుండానే పట్టుదలతో సూక్ష్మ కళాకారుడినయ్యాను. మా అన్న రాజు దివ్యాంగుడు. ఆయన మంచి కళాకారుడు చనిపోయాడు. తరువాత అన్నయ్య కలను నెరవేర్చాలని పట్టుదలతో మైక్రో ఆర్టిస్టను అయ్యాను. అందరిలో నాకంటూ ప్రత్యేకత ఉండాలనే సంకల్పంతో రాత్రి పగలూ కష్టపడ్డాను. ఇప్పటి వరకు 500 వరకు చాక్‌పీస్, గ్రాఫైట్స్, సబ్బుబిళ్లలపై కళాకృతులు వేసి పలు అవార్డులు కైవసం చేసుకున్నాను. ఆర్ట్ టీచర్ కావాలనుకుని కష్టపడి సాధించాను.

– ఆడెపు రజనీకాంత్,ఆర్ట్ టీచర్

క్లాస్‌మేట్ కూతురు వివాహానికి రూ.లక్ష సాయం



ఆర్థికసాయం అందిస్తున్న స్నేహితులు

సుల్తానాబాద్: పట్టణానికి చెందిన కట్ల శ్రీనివాస్ కూతురు వివాహానికి 1990–91 ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు రూ. 1 లక్ష సాయం చేశారు. శనివారం వివాహం సందర్భంగా ఆయనకు నగదును అందజేశారు. సుల్తానాబాద్ జెడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో తమతో చదువుకున్న శ్రీనివాస్ పేదరికంతో తన కూతురు పెళ్లి చేయడానికి ఇబ్బంది పడుతున్నాడని తెలుసుకుని తమ వంతు సాయంగా తలా కొంత సేకరించి నగదును శ్రీనివాస్‌కు అందజేశారు. ఏగోలపు కుమార్ గౌడ్ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు డాక్టర్ ఏగోలపు సదయ్య గౌడ్ పట్టుచీర, బియ్యం అందజేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



బాధితులకు నగదు అందిస్తున్న గ్రామస్తులు

కాల్వ శ్రీరాంపూర్: మండలంలోని వెన్నంపల్లిలో కాసాని ఐలయ్య కుటుంబానికి కాంట్రాక్టర్ జిన్న శ్రీనివాస్ రెడ్డి రూ. 25 వేల ఆర్థికసాయం అందజేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన ఐలయ్య ఇల్లు అగ్ని ప్రమాదంలో కాలిపోయింది. సమాచారం తెలుసుకున్న కాంట్రాక్టర్ జిన్న శ్రీనివాస్ రెడ్డి రూ.25 వేల ఆర్థికసాయం పంపించి ఉదారత చాటుకున్నారు. కార్యక్రమంలో జిన్నా సురేందర్ రెడ్డి, ఎంపీటీసీ జట్టి దేవేందర్, బుద్దే సత్యనారాయణ, కలవైన రమేశ్, దామ.అనిల్, తొట్ల శ్రీనివాస్ యాదవ్, బండి సుధాకర్ ఉన్నారు.

వాహనాల తనిఖీ

ఓదెల:పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇందుర్తి, గుంపుల, గూడెం గ్రామాల్లో ఎస్సై మహేందర్ ఆధ్వర్యంలో శనివారం వాహనాలను తనిఖీ చేశారు. ఆయా గ్రామాల మీదుగా కాల్వశ్రీరాంపూర్, సుల్తానాబాద్ వైపునకు వెళ్లే వాహనాలను తనిఖీ చేసి, సరైన ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలకు జరిమానా విధించారు.

ముస్లిం మైనార్టీలకు ప్రభుత్వం అండ

- ఎమ్మెల్యే కోరుకంటి చందర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరుకంటి చందర్

జ్యోతినగర్: ముస్లిం మైనార్టీలకు ప్రభుత్వం అండగా ఉంటుందని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. శనివారం ఎన్టీపీసీ రామగుండం ఏవీ ఫంక్షన్ హాల్‌లో ఆల్ మైనార్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రంజాన్‌కు పేద ముస్లింలకు రంజాన్ కానుక అందించడం సీఎం కేసీఆర్‌కే సాధ్యమైందన్నారు. ముస్లిం మైనార్టీలకు ప్రభుత్వపరంగా సహకారం అందిస్తామన్నారు. అందరు సోదర భావంతో కలిసిమెలసి జీవించాలన్నారు. ముస్లిం అభివృద్ధి కోసం ప్రభుత్వం పలు పథకాలను ప్రవేశ పెట్టిందన్నారు. అనంతరం ఎమ్మెల్యే చందర్‌కు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. సమావేశంలో ఆల్ మైనార్టీస్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆదిల్ షరీఫ్, ప్రధానకార్యదర్శి మాజిద్ ఖాన్, గౌరవ అధ్యక్షుడు అహ్మద్ అలీతో పలువురు పాల్గొన్నారు.


నూతన కమిటీ నియామకం

పెద్దపల్లి జిల్లా ఆల్ మైనార్టీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మహమద్ సినాదొద్దీన్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జియా అహ్మద్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా మహ్మద్ అశ్వక్, గౌరవ అధ్యక్షుడిగా మహ్మద్ అక్రం, ప్రధానకార్యదర్శిగా మహ్మద్ గౌస్ పాషా, కోశాధికారిగా రహీంతో పాటు పలువురిని ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

రామగుండం: సీఎం కేసీఆర్ మానసపుత్రిక కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలని, ఆడ బిడ్డలకు వైభవంగా వివాహాలను జరిపించడమే కేసీఆర్ లక్ష్యమని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. శనివారం పట్టణంలోని పలు డివిజన్లకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కన్నూరి సతీష్‌కుమార్, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బొద్దుపల్లి శ్రీనివాస్, సలీంబేగ్, ఇసంపెల్లి తిరుపతి,తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంపై దృష్టి సారించాలి



సదస్సు ప్రారంభిస్తున్న ఉషాకుమార్

జ్యోతినగర్: మహిళలు తమ ఆరోగ్యపరిరక్షణలో ప్రత్యేకంగా దృష్టి సారించాలని, ఎన్టీపీసీ సంస్థ ప్రత్యేక వైద్య సదుపాయాలు కల్పిస్తోందని దీప్తి మహిళా సమితి అధ్యక్షురాలు ఉషాకుమార్ అన్నారు. శనివారం పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని ధన్వంతరి ఆస్పత్రిలో మహిళల్లో క్యాన్సర్‌కు సంబంధించిన సమస్యలపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. సంస్థ ప్రత్యేకంగా వైద్య శిబిరాలను నిర్వహిస్తూ అత్యుత్తమ వైద్య సేవలను అందిస్తున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్ అపోలో ఆస్పత్రి సర్జికల్ గైనకాలజిస్ట్ డాక్టర్ సాయి లక్ష్మి స్త్రీల ఆరోగ్యానికి సంబంధించిన వివిధ అంశాలను, స్త్రీ క్యాన్సర్ సమస్యలు, దాని కారణాలు, ముందస్తుగా గుర్తించడం, రోగ నిర్ధారణ, చికిత్స విధానాలను వివరించారు. కార్యక్రమంలో డాకర్లు లహరి, అర్చన పాల్గొన్నారు.

'తెలంగాణ విద్రోహులకు అందలమా...?'

- ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు గుండేటి ఐలయ్య

పెద్దపల్లిరూరల్: స్వరాష్ట్ర కోసం అష్టకష్టాలు పడి జైళ్లకు వెళ్లిన ఉద్యమకారులను పక్కనబెట్టి ఉద్యమ విద్రోహులను తెలంగాణ ప్రభుత్వం అందలమెక్కించడం సరికాదని ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు గుండేటి ఐలయ్య ఆరోపించారు. పెద్దపల్లిలోని అమరవీరుల స్థూపం వద్ద శనివారం చలో హైదరాబాద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న ఆత్మగౌరవ సదస్సును విజయవంతం చేయాలని కోరారు. అసలైన ఉద్యమకారుల కుటుంబాలు అధోగతిపాలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. సదస్సుకు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీమాన్, ధనుంజయ్, మల్లయ్య, హనుమాండ్లు,, సతీష్, రమేశ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం

టీయూఎఫ్ మండల అధ్యక్షుడిగా నాగరాజు



నాగరాజు

సుల్తానాబాద్: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడిగా సుల్తానాబాద్ పట్టణానికి చెందిన కూకట్ల నాగరాజును నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు గుండేటి ఐలయ్య యాదవ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 12న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర సదస్సుకు తెలంగాణ ఉద్యమకారులు అత్యధిక మంది తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

మున్నూరు కాపు సంఘం కల్వచర్ల గ్రామ అధ్యక్షుడిగా శంకర్



శంకర్

రామగిరి: మండలంలోని కల్వచర్ల మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడిగా తోట శంకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామంలో శనివారం నిర్వహించిన సంఘం సర్వసభ్య సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడుగా చిందం అనిల్, ప్రధాన కార్యదర్శిగా రేండ్ల శ్రీధర్, కోశాధికారిగా రేండ్ల కృష్ణమూర్తి, గౌరవ అధ్యక్షుడుగా కుడిది వేణుగోపాల్, ముఖ్య సలహాదారులుగా కొప్పుల సునీల్, రాపెల్లి శ్రీధర్, కార్యవర్గ సభ్యులుగా మహేందర్, శ్రీనివాస్, రాజయ్య, వరాల హరీశ్, బూస అజయ్‌ను ఎన్నుకున్నారు. సంఘం అభివృద్ధి కోసం కృషి చేస్తానని, తనను ఎన్నుకున్న సభ్యులకు శంకర్ కృతజ్ఞతలు తెలిపారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

సుల్తానాబాద్: పట్టణంలోని 8వ వార్డులో పలు అభివృద్ధి పనులకు ఆదివారం పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత గౌడ్ తెలిపారు. ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, అధికారులు సకాలంలో హాజరై కార్యక్రమంను జయప్రదం చేయాలని కోరారు.

భవిష్యత్తు అంతా మహిళలదే



ఆటలు ఆడుతున్న అంగన్‌వాడీ టీచర్లు

సుల్తానాబాద్: భవిష్యత్ కాలమంతా మహిళలదేనని మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత గౌడ్ అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మహిళా దినోత్సవం సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, మెప్మా ఆర్పీ, మున్సిపల్ మహిళ సిబ్బందికి స్నేహపూర్వక క్రీడలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, భూమిపై నడిచే రైలు మొదలుకుని ఆకాశంలో ఎగిరే విమానం వరకు మహిళలు పడుపుతున్నారని, పురుషులకు సైతం ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. సమాజంలో మహిళల కీలక పాత్రను పోషిస్తున్నారని తెలిపారు. వాణిజ్య, వ్యాపార రంగాలతో పాటు రాజకీయ, ప్రభుత్వ రంగాల్లో కీలక స్థానాల్లో మహిళలు ఉన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు పసిడ్ల మమత, నిషాద్, చింతల సునీత, మహిళలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

లఘు చిత్ర ఉత్తమ దర్శకుడిగా మహేశ్

గోదావరిఖనిటౌన్: కరీంనగర్ ఫిలిం సొసైటీ, తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ నిర్వహించిన రాష్ట్ర స్థాయి లఘు చిత్రాల పోటీల్లో ఉత్తమ చిత్రంగా నందిని లవ్ స్టోరీ, ఉత్తమ దర్శకుడిగా గోదావరిఖని విఠల్‌నగర్‌కు చెందిన మహేశ్ గొట్టె ఎంపికకాగా, శుక్రవారం రాత్రి కరీంనగర్‌లోని ఫిలిం భవన్‌లో ప్రముఖ సినీ గాయని, సంగీత దర్శకురాలు ఎం.ఎం. శ్రీలేఖ చేతుల మీదుగా మహేశ్‌కు మోమెంటో, ప్రశంసాపత్రం, నగదు బహుమతి అందుకున్నాడు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ తాను రూపొందించిన నందిని లఘు చిత్రానికి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. చిత్రాన్ని ఆదరించిన కళాభిమానులకు,పెద్దలందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

బహుజన సాహిత్య అకాడమీ అవార్డుకు ఎంపిక

కమాన్‌పూర్: మండల కేంద్రానికి చెందిన దాసరి రామస్వామి బహుజన సాహిత్య అకాడమీ అవార్డుకు ఎంపిక చేసినట్లు అకాడమీ చైర్మన్ నల్ల రాధాకృష్ణ తెలిపారు. రామస్వామి వివిధ కళారంగాల్లో, తెలంగాణ ఉద్యమంలో తన పాటలు, డప్పు వాయిద్యంతో ప్రజలను ఆకట్టుకున్నారు. నేడు తిరుపతిలో జరిగే కార్యక్రమంలో రామస్వామి ఈ అవార్డును అందుకోనున్నారు.

గోశాలకు బాలుడి విరాళం

సుల్తానాబాద్: పట్టణంలోని గొల్లపల్లి కి చెందిన కావటి సాయిరక్షిత్ అనే బాలుడు తన పుట్టిన రోజు సందర్భంగా గోశాలకు పశుగ్రాసం, 50 కిలోల తవుడు, కూరగాయలు నగదును విరాళంగా అందజేశాడు. తమ కుమారుడు కిడ్డీ బ్యాంకులో దాచుకున్న మొత్తాన్ని గోశాలలోని ఆవుల కోసం అందజేసినట్లు తల్లిదండ్రులు తెలిపారు. కార్యక్రమంలో గోశాల అధ్యక్షుడు బండారి సూర్య, ప్రధాన కార్యదర్శి నూక రాందాస్, ట్రెజరర్ బండారి భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

సంకట చతుర్థి పూజలు

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని శివాలయంలో సంకట చతుర్థి సందర్భంగా శివునికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పులికాంత భరత్‌రాజ్, శివాని దంపతులు అన్నపూజ, రుద్రాభిషేకం, పూజలు చేశారు. కార్యక్రమంలో అర్చకులు మహేశ్, రమేశ్, ఆలయ కమిటీ చైర్మన్ అల్లంకి సత్యనారాయణ, కొమురవెల్లి అంజయ్య, రవీందర్, శివలీల, ఆనందం,తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

ధర్మారం: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ఎమ్మెల్సీ కవితపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ధర్మారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రాసూరి శ్రీధర్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం సంజయ్ దిష్టిబొమ్మ దహనం చేశారు. స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో నాయకులు రాస్తారోకో చేపట్టి అనంతరం దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ చొప్పరి చంద్రయ్య, ధర్మపురి దేవస్థానం కమిటీ సభ్యుడు జైన రాజమౌళి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కూరపాటి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు తిరుపతిరావు, మహిళ పట్టణ అధ్యక్షురాలు లావణ్య, సర్పంచులు, ఎంపీటీసీలు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెద్దపల్లి జిల్లా :
9951602934
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
మంథని : రాకేశ్ - 9676603963
పెద్దపల్లి : నరేశ్ - 8639544665
రామగుండం : సర్వర్ - 6281694028
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899